క్లుప్తంగా

రేపు విద్యుత్ అదాలత్

నరసరావుపేటటౌన్: ఈ నెల 20వ తేదీన విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ చేజర్ల రాంబొట్లు మంగళవారం తెలిపారు. డివిజన్ కార్యాలయంలో ఉదయం 10.30 కి నిర్వహించే కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్‌తో పాటు ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. వినియోగదారులు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు శ్రీ వెంకట ఏకో నారాయణస్వామి తిరునాళ్ల



బొల్లాపల్లి: మండల కేంద్రమైన బొల్లాపల్లిలో నెలకొన్న శ్రీ వెంకట ఏకోనారాయణస్వామి తిరునాళ్ల బుధవారం జరగనుంది. తిరునాళ్లను పురస్కరించుకొని భక్తులు భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటుకు సిద్ధమయ్యారు. స్వామివారి విగ్రహాన్ని గతంలో కొండప్రాంతంలో లభించడంతో అటవీ శాఖ అధికారులు, గ్రామపెద్దలు విగ్రహాన్ని రోడ్డుపై ప్రతిష్ఠించి అప్పటి నుంచి స్వామివారికి ప్రత్యేక ఉత్సవాలు జరపడం ఆనవాయితీగా పెద్దలు చెబుతున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు.

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు

నూజెండ్ల: మండలంలో నేటి నుంచి నిర్వహించే ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పావులూరి ఉమాదేవి తెలిపారు.19న అయినవోలు, పాతజడ్డావారిపాలెం, 20న పెద్దారం, కొత్త జడ్డావారిపాలెం,21న మృత్యుంజయపురం,పాత చెరుకొమ్ముపాలెం,22న తంగిరాల,కొత్త చెరుకొమ్ముపాలెం,25న జంగాలపల్లె, పాతనాగిరెడ్డిపల్లె,26న త్రిపురపురం, పమిడిపాడు,27న తేదీన తలార్లపల్లి, ముతరాసుపాలెం గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తామన్నారు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం కల్గిన ప్రతి బిడ్డకు బాల ఆధార్ ధ్రువీకరణ పత్రం కోసం పొందవచ్చునన్నారు,

స్త్రీనిధి రుణాలు నూరుశాతం చేయాలి

రీకవరి అధికారి శ్రీరామ్

నూజెండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సమాఖ్యా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్త్రీనిధి రీకవరి మేనేజరు పసుపులేటి శ్రీరామ్ పాల్గొని మాట్లాడుతూ నూజెండ్ల మండలంలో రూ. 20 లక్షలు మొండి బకాయిలు ఉన్నాయని ఈనెలఖారులోగా నూరుశాతం వసూలు చేయాలన్నారు. స్త్రీనిధి రుణాలు వసూలు చేస్తేనే తదుపరి ఇవ్వటానికి ఉన్నతాధికారుల నుంచి అనుమతులు మంజూరు అవుతాయన్నారు. దీర్ఘకాలిక బకాయిలు చెల్లించటానికి క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన విధి విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గుంటుపల్లి సుజాత, లిఖిల్ కోఆర్డినేటరు ముంద్రు బ్రహ్మయ్య, సీసీలు కొండలు, సుబ్బారావు, రాజశేఖర్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

అడవి పేరంటాళ్ళమ్మకు అదనపు ఆదాయం

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల వేడుకలు ఈనెల 31న పురస్కరించుకొని దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసుకొని అమ్ముకునే వాటికి బహిరంగ వేలంపాట నిర్వహించినట్లు దేవాదయ అధికారి యం. సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏటా దేవదాయశాఖ వారి సారథ్యంలో నిర్వహించే కొబ్బరికాయలు, కొబ్బరిచిప్పలు,పూజా ద్రవ్యములు, ఫలహారములు అమ్ముకునే విధంగా బహిరంగ వేలంపాట చేపట్టినట్లు తెలిపారు. కొబ్బరికాయలు రూ.67 వేలు, కొబ్బరి చిప్పలు రూ.16.500, ఫలహారములు-రూ.33వేలకు కొత్త శ్రీరామమూర్తి, బండారు రామారావులు దక్కించుకున్నట్లు తెలిపారు. బహిరంగపాటలో దక్కించుకున్నవారు ఈనెల 30 నుంచి 31వ తేదీ వరకు అమ్ముకునే విధంగా అనుమతులు జారీ చేశామన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

చిలకలూరిపేట: ఏపీ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ చిలకలూరిపేట శాఖ నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఎంపిక చేశారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా లంకా ఆదినారాయణరెడ్డి, అధ్యక్షుడిగా కె.మురళీధరరావు, కార్యదర్శిగా జి.వెంకటప్ప, కోశాధికారిగా వి. ఉమామహేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.జాషువాలను ఎన్నుకున్నారు. సంఘ గౌరవ సలహాదారులుగా సీహెచ్ పట్టాభిరామారావుతో పాటు ఐదుగురిని ఉపాధ్యక్షులుగా, మరో ఐదుగురిని సంయుక్త కార్యదర్శులను, కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసుకున్నారు.

టీకాలతోనే పశువులకు రక్షణ

- గాలికుంటు వ్యాధి నివారణకు ఉచిత టీకాలు
- 31 వరకు అవకాశం



జాలాదిలో టీకాలు వేస్తున్న దృశ్యం

యడ్లపాడు: పశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, పశువైద్యశాఖ గాలికుంటు వ్యాధి నివారణకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. ఈ అంటు వ్యాధి తీవ్రంగా వ్యాపించే ప్రమాదం ఉన్నందున జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. గ్రామాల్లోని ప్రతి పశువుకు ఉచితంగా టీకాలు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మార్చి 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పశువైద్యశాలల్లో ఈ ఉచిత టీకాలను వేస్తున్నట్లు యడ్లపాడు పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ వై రాధాకృష్ణ తెలిపారు.

వైరస్ రకాలు

గాలికుంటు అనేది వైరస్ వల్ల కలిగే తీవ్రమైన అంటువ్యాధి. ఈ వ్యాధి ముఖ్యంగా చీలలు, గిట్టలున్న పశువులకు ఎక్కువగా సోకుతుంది. వైరస్‌లో ఓఏసీ, ఆసియా-1, సాట్-1, 2, 3 అనే రకాలు ఉన్నాయి. ఈ వ్యాధి గాలి ద్వారా ఇతర పశువులకు వేగంగా వ్యాపిస్తుంది. దేశవాళీ పశువుల కంటే సంకరజాతీ పశువుల్లో ఈ వ్యాధి ఎక్కువ నష్టం కలుగజేస్తుంది. దీంతో రైతులు ఆర్థికంగా ఎక్కువ నష్టం వాటిల్లుతుంది.

వ్యాధి లక్షణాలు

గాలికుంటువ్యాధి సోకిన ఆవులు, ఎద్దులు, గేదెల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. నోటిలో బొబ్బలు పగిలి చొంగ కారుతుంది. ఆహారం సరిగా తీసుకోలేవు. కాలి గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి పుండ్లుగా మారతాయి. దీంతో పశువులు నీరసపడి నడిచేందుకు ఇబ్బంది పడతాయి. పాలిచ్చే రొమ్ములపైన, పొదుగులపైన బొబ్బలు ఏర్పడతాయి.

గర్భధారణ శక్తిని కోల్పోతాయి. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచనల మేరకు యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ వంటి మందులను వాడాల్సి ఉంటుంది. మేకలు, గొర్రెలు, పందుల్లోనూ గాలికుంటు వ్యాధి వస్తుంది.



గాలికుంటు వ్యాధి సోకిన పశువు

వ్యాధి వ్యాప్తి ఇలా..

ఈ వ్యాధి కలిగించే వైరస్ క్రిములు పశువులను నేరుగా తాకినపుడు, పేడ, పారుడు, పొంగు, వీర్యం, పాలు, పుండ్లు ద్వారా విసర్జింపబడి ఇతర పశువులకు సంక్రమిస్తాయి. ముఖ్యంగా గాలి, నీరు, మేత ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

నివారణ చర్యలు

గాలికొంటు వ్యాధి సోకిన పశువులను, ఆరోగ్యవంతమైన పశువుల నుంచి వేరు చేయడం అత్యవసరం. పశువుల పాకలను 5 శాతం క్రెసాల్‌ను కలిపిన నీటితో శుభ్రం చేయాలి. వ్యాధి ప్రబలిన గ్రామాల్లో పశువులను సంతలకు, జాతర్లకు తీసుకెళ్లకూడదు. ఆరోగ్యంగా ఉన్న పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి.

పరిశుభ్రత – ఇతర జాగ్రత్తలు

- వ్యాధి సోకిన పశువుల కళేబరాలను లోతైన గొయ్యిలో పాతాలి లేదా కాల్చివేయాలి.
- పాలను బాగా ఉడకబెట్టిన తర్వాత మాత్రమే వినియోగించాలి
- వ్యాధిగ్రస్త పశువుల పాలను తాగిన దూడలకు ప్రాణాపాయం ఉండే అవకాశం ఉంది.
- వ్యాధి సోకిన ఆంబోతులను సంపర్కానికి వినియోగించరాదు.
- పాడి పశువుల కొలనులు, పాకలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి.

సద్వినియోగం చేసుకోవాలి



జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద ఈ నెల చివరి వరకు ఉచితంగా టీకాలు అందిస్తోంది. తొలిసారి రెండు నెలల వయస్సులో వేయించాలి. నెల తర్వాత బూస్టర్ డోస్ తప్పనిసరిగా వేయించాలి. ప్రతి ఏడాది టీకా వేయించుకోవడం ద్వారా వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. టీకా తీసుకున్న పశువులలో 1-3 వారాల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. పాలిచ్చే పశువులకు ఈనిన తరువాత టీకా వేయించాలి. రైతులు తమ పశువులకు గాలికొంటు వ్యాధి టీకా వేయించేందుకు ముందుకొచ్చి, ఉచిత టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ వై.రాధాకృష్ణ, ఏడీ యడ్లపాడు ఏరియా పశువైద్య కార్యాలయం

విశ్రాంత ఉపాధ్యాయుడికి సత్కారం

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన ఇటీవల పదవీ విరమణ చేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్. రామకృష్ణారెడ్డికి మంగళవారం ఫోటో ఫ్రేమ్ బహుకరించి సత్కరించారు. గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.రామకృష్ణారెడ్డికి ఫొటో ఫ్రేమ్ బహుకరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి మాట్లాడుతూ 36 సంవత్సరముల ఉపాధ్యాయ వృత్తిలో రామకృష్ణారెడ్డి ఎందరో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 22 సంవత్సరాలు ఉపాధ్యాయులుగా పనిచేసి స్కూల్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన రామకృష్ణారెడ్డి శేషజీవితం సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు పిడెం హుస్సేన్, పంబా వెంకట్, ముక్కడాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపికను బహుకరిస్తున్న మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, పూర్వ విద్యార్థులు

సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక నైపుణ్యాలు

రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు

నాదెండ్ల: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రత్యేక నైపుణ్యాలు గలిగిన మానవ వనరులు దేశానికి విలువైన సంపదని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. కనపర్రు శివారు మైనంపాడులో కార్యకర్తల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకూ నాణ్యమైన విద్య అందించేందుకు ప్రాథమిక స్థాయిలోనే పునాదులు వేయాలన్నారు. సబ్జెక్టు తరగతి వారీగా ఉపాధ్యాయులు ఉండేలా ప్రతి గ్రామంలో ఒక మోడల్ పాఠశాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. 1-2 తరగతుల విద్యార్థులకు మహిళా టీచర్లు బోధించేలా నియామకాలు చేయాలన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులో తేవాలని, పూర్వ ప్రాథమిక విద్యను ప్రాథమిక విద్యతో జోడించి విలువైన మానవ వనరులను తయారు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాలె వెంకటస్వామి, మాలె మోషే, జూపల్లి వెంకటేశ్వర్లు, మాలె ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీహెచ్ సుబ్బారావు

మానసిక దృఢత్వంతోనే సమాజంలో రాణింపు

నాదెండ్ల: ఆరోగ్య సమస్యల పట్ల విద్యార్థినులు పూర్తి అవగాహన కలిగి ఉన్నపుడే విద్యలో లక్ష్యాలు సాధించవచ్చని సైకాలజిస్ట్ అండ్ కౌన్సిలర్ సీహెచ్ ఫణీందర్ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం మెంటల్ హెల్త్ అండ్ కెరియర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. మానసికంగా దృఢంగా ఉంటేనే విద్యలో సమాజంలో రాణించగలరన్నారు. నేటి మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, బాలికలు చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ ఫణీందర్

రేషన్ డీలర్లు చేసే తప్పులకు బలిచేయకండి

- అధిక రేట్లు వసూలు చేస్తోంది డీలర్లే
- స్పష్టం చేసిన ఎండీయూ ఆపరేటర్లు

నరసరావుపేట: జిల్లాలో రేషన్ డీలర్లు చేసే తప్పులకు తమను బలిచేయటం ఏమాత్రం సబబుకాదని ఎండీయూ ఆపరేటర్లు వాపోయారు. మంగళవారం జిల్లా అధికారుల పిలుపు మేరకు జిల్లాలోని 402 వాహనాల ఆపరేటర్లులో సుమారుగా 300 మంది కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. రేషన్ పంపిణీలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను పౌర సరఫరాలశాఖ అధికారులకు వివరించారు. ఈసందర్భంగా ఎండీయూ వాహనాల యూనియన్ నాయకులు సుధాకరరెడ్డి, శ్రీనివాసరావు, కొందరు ఆపరేటర్లు మాట్లాడుతూ జిల్లాలో 402 వాహనాలు పనిచేస్తుంటే అందులో 50 మంది ఎండీయూ ఆపరేటర్లను వివిధ కారణాలతో తొలగించి వారులేకుండానే డీలర్లు అందజేస్తున్నారన్నారు. దీంతో పాటు ప్రతి బండి వెంట డీలర్లు వచ్చి లబ్ధిదారులకు కిలో కంది పప్పు రూ.67లకు విక్రయించాల్సి ఉండగా రూ.70లు నుంచి రూ.75లు, పంచదార అరకేజీ రూ.17లకు విక్రయించాల్సి ఉండగా రూ.20లు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఐవీఆర్ఎస్ కాల్స్‌లో తమ వద్ద అధికంగా డబ్బులు తీసుకుంటున్నారని ఫిర్యాదులు చేశారన్నారు. ఉదయాన్నే తమకు బియ్యం అందజేయాల్సింది డీలర్లని, వారు ఇవ్వకపోతే తాము ఇళ్లవెంట తిరిగి ఏవిధంగా అందజేయగలమని ప్రశ్నించారు. డీలర్లు చేసే అనేక తప్పులకు తమను బాధ్యులు చేయటం సబబుకాదని అన్నారు. నిష్పాక్షికంగా రేషన్ సరఫరాకు తమ వంతు సహకారం అందజేస్తామని పేర్కొన్నారు.



సమస్యలు వివరిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ



వినుకొండ: మచిలీపట్నంలో జరిగిన ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో స్థానిక తిమ్మాయపాలెం రోడ్డులో గల ఆక్స్‌ఫోర్డ్ స్కూల్ చదువుతున్న డి.శివనందన, ఎస్.సాయిభవాని ప్రథమ బహుమతి, ఎస్. సుజాత ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాల డైరెక్టర్ కొల్లి లక్ష్మి అభినందించారు. ఆడపిల్లలకు కరాటే నేర్చుకోవడం చాలా ముఖ్యమని పలువురు తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ షేక్ కాజా మొహిద్దీన్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోడల్ స్కూలులో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

నాదెండ్ల: చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరబడుతున్నట్లు ప్రిన్సిపల్ ఝాన్సీవాణి చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి మే నెల 22 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఇంగ్లిష్ మీడియంలో చేరేందుకు పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేయాలన్నారు. మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150లు ఫీజు చెల్లించాలన్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్య తీసుకోవాలి

చిలకలూరిపేట: నిబంధనలు పాటించని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ పట్టణ కన్వీనర్ బి.రాంబాబునాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్, ఎంఈవో రత్నకళకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఒంటిపూట బడి విధానాన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అమలు చేయడం లేదని ఫిర్యాదు చేశారు. ఎండ తీవ్రతకు విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే సంబంధిత పాఠశాలలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జాబ్‌మేళాలో ఎంపికలు

చిలకలూరిపేట నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఈ తమ్మాజీరావు చెప్పారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో పట్టణంలోని రాగన్నపాలెం కమ్యూనిటీ హాలులో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళాకు 41 మంది నిరుద్యోగులు హాజరుకాగా, అందులో నుంచి 21 మందిని మూడు కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్‌లు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీడాప్ ప్లేస్‌మెంట్ అధికారి నాగుల్, సిబ్బంది జె సురేష్, జేఆర్‌పీ రాజు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన వారితో అధికారులు

ఉపాధిహామీ కూలీలకు వసతులు కల్పించాలి

ద్వామా పీడీకి వ్యవసాయ కార్మిక సంఘం వినతి

నరసరావుపేట: పగటిపూట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న పని ప్రదేశాలలో ఉపాధి కూలీలకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, అధికార యంత్రాంగం కూలీలకు కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చూపుతుందని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు విమర్శించారు. ఈ మేరకు పథకం కూలీల సమస్యలు పరిష్కరించాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం రామిరెడ్డిపేటలోని పీడీ కార్యాలయంలో డ్వామా పీడీ సిద్దలింగమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో కూలీలకు పని ప్రదేశాలలో వసతులు కల్పించడం లేదన్నారు. దీనివలన వడదెబ్బకు గురై అస్వస్థకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కొద్ది రోజులలో కొత్త ఆర్థిక ఏడాది ప్రారంభం కావడం వ్యవసాయ పనులు ముగియడం తదితర కారణాలతో కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, కూలీలు వలసలు నివారించేందుకు కొత్త పనులను గుర్తించాలన్నారు. ఉపాధి కూలీలు భోజనం చేయడానికి అలసటగా ఉన్నప్పుడు సేద తీరడానికి గతంలో ప్రభుత్వం గుడారాలు, టెంట్లు పంపిణీ చేసే విధానానికి కొన్నేళ్లుగా స్వస్తి పలికారని వాటిని అందిస్తే కూలీలకు ఉపశమనం కలుగుతుందన్నారు. పని ప్రదేశాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ కూలీలు పనిచేసి నెలలు కావస్తున్న వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వేతనాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయాలకతీతంగా కూలీలకు పనులు చూపించాలని, దళిత గిరిజనులను అందరితో సమానంగా కాకుండా వేరుగా ఆలస్యంగా పనులు చూపడం జరుగుతుందని మొదటి ప్రాధాన్యత ఇచ్చి దళిత గిరిజనులకు ఉపాధి హామీ పనులు చూపించాలని కోరారు. పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, నీడ కోసం కోసం టెంట్లు, పే స్లిప్పులు ఇవ్వాలని పనిదినాలు పెంచి వేసవి అలవెన్సులు పనిముట్లు ఇవ్వాలని కోరారు. డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని, పెండింగ్ వేతనాలు త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కారుచోల రోశయ్య, జిల్లా నాయకులు కొమ్ముల నాగేశ్వరరావు, జమండ్లమూడి భగత్ పాల్గొన్నారు.



పీడీ లింగమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బొల్లాపల్లిలో సోషల్ ఆడిట్ ప్రజావేదిక

రూ.28,754లు రికవరీ

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 16వ విడత సామాజిక తనిఖీ బృందం ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. 33 పంచాయతీల్లోని గ్రామాల్లో చేపట్టిన పనులను తనిఖీ నిర్వహించి గ్రామసభల అనంతరం ప్రజావేదికలో నివేదికను బహిరంగ పరిచినట్లు ఆడిట్ ఎస్ఆర్‌పీ జీఎస్ రాజు ప్రకటించారు. ఆయా పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా విభాగానికి చెందిన 625 పనులకు గాను రూ.13.81కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ఆయా గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజావేదికలో వివరాలు వెల్లడించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన జిల్లా డ్వామా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి మాట్లాడుతూ సోషల్ ఆడిట్‌లో వెలుగు చూసిన అవినీతికి సంబంధించి రికవరీలు జరిగినప్పుడే సామాజిక తనిఖీలకు ప్రాధాన్యత చేకూరుతుందన్నారు. గతంలో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన అవినీతి సొమ్మును రికవరీ చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. గత సోషల్ ఆడిట్‌లో రూ.77లక్షలు రికవరీకి ఆదేశించడమైందని, నగదును త్వరితగతిన రికవరీ చేయాలని సూచించారు. ప్రస్తుత సోషల్ ఆడిట్‌లో నిష్పక్షపాతంగా నిర్వహించారన్నారు. 16వ విడత సామాజిక తనిఖీల్లో రూ.13.81 కోట్లకు గాను 625 పనులు చేయగా వీటిలో రూ.51.99 లక్షలు క్వాలిటీ కంట్రోల్ తనిఖీలకు అప్పగించడమైందని తెలిపారు. రూ.28,754లు ఈ సామాజిక తనిఖీలో రికవరీ, రూ.24 వేలు ఫెనాల్టీ విధించడమైందని, 33 గ్రామపంచాయతీల్లో 16వ విడత సామాజిక తనిఖీల్లో ప్రజావేదికలో బహిరంగ పరచడమైందని పీడీ వివరించారు. కార్యక్రమంలో ఏపీడీ ఈ. బూసిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో పి.సీతారామయ్య, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- నాయబ్ బజార్ పెద్దమసీదు ఇఫ్తార్

నరసరావుపేట: రంజాన్ మాసం ముస్లింల ఐకమత్యానికి, మతసామరస్యానికి ప్రతీకని, రంజాన్ పండుగను ప్రతిఒక్క ముస్లిం సోదరులు ఆనందంగా జరుపుకోవాలని, అందరూ ఐకమత్యంగా కలిసి మెలిసి ఉండాలని, అల్లాహ్ వారి ప్రార్థనలను ఆలకించి వారి కుటుంబాలను సంతోషంగా చూడాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని నాయబ్ బజార్ పెద్ద మసీదులో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు పండ్లు, ఫలహారాలిచ్చి ఈనాటి రంజాన్ ఉపవాస దీక్షను విరమింప చేశారు. ముస్లిం సోదరులతో కలిసి నమాజులో పాల్గొని అల్లాహ్‌ను ప్రార్థించారు. అనంతరం మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులందరూ అంకుఠిత దీక్షతో నెల అంతా ఉపవాసాలు ఉంటూ అల్లాహ్‌ను తమ కోరికలు నెరవేర్చాలని ప్రార్థిస్తారని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్క ముస్లిం సోదరునికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కంజుల జగన్‌మోహనరెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, వైఎస్సార్ సీపీ జిల్లా మున్సిపల్ విభాగ అధ్యక్షులు షేక్ రెహమాన్, పట్టణ పార్టీ నాయకులు షేక్ కరిముల్లా, షేక్ సిలార్‌బాషా, ఇమామ్‌బాషా, కరిముల్లా, వరవకట్ట బుజ్జి, షేక్ కాజా, షేక్ ఇమాంబాషా, షేక్ ఖాదర్‌బాషా, సయ్యద్ ఖాదర్‌బాషా, గౌస్ పీర్, సయ్యద్ జాఫర్, షేక్ గౌస్, హన్ను, ఎంఐఎం నాయకులు కరిముల్లా, మౌలాలి, పట్టణ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



పెద్దమసీదులో ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

ఘనంగా మహంకాళి అమ్మవారి తిరునాళ్ల

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం 50వ తిరునాళ్ల మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలు, పూలతో అలంకరించారు. ఉదయం అమ్మవారికి స్నపనం, విశేష పూజలు అనంతరం ప్రత్యేక అలంకారం జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి సమర్పించారు. ప్రధాన కలశ ఆలయ ప్రవేశాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం యాగశాలలో పూర్ణాహుతి జరిపి పూజ పండిత సత్కారాలు జరిపారు. శైవాగమ పండితులు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాము లు కొత్తలంక కార్తికేయశర్మ పూజాధికాలు నిర్వహించారు. చుట్టుప్రక్కల గ్రామాలతో పాటు పట్టణం నుంచి బాలప్రభలు, మొక్కుబడి ప్రభలను ఆలయానికి తీసుకువచ్చారు. డీజేలు, డప్పు దరువులతో యువత సందడి చేశారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నప్రసాద వితరణ గావించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరునాళ్లకు ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ కమీషనర్ జె.శ్రీనివాసరావు, ఈవో ఎస్.మాధవిదేవిలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ప్రధాన కలశ ఆలయ ప్రవేశం

రెవెన్యూ చలివేంద్రం ప్రారంభం

రొంపిచర్ల: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ బండి నిర్మల ప్రారంభించారు. వేసవిలో కార్యాలయానికి వచ్చే ప్రజలకు, కార్యాలయ సిబ్బందికి ఈ చలివేంద్రం దాహార్తిని తీర్చుతుందన్నారు. తాటి మట్టలతో ఏర్పాటు చేసిన చలువ పందిరిలో రెవెన్యూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభోత్సవ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పలువురు వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

